
స్వాగతం - సుస్వాగతం
పి.జి.నీలమేఘం
నగరి మున్సిపల్ చైర్మన్
ప్రజాక్షేత్రంలో తిరుగులేని నాయకునిగా...
వైయస్ఆర్‌సీపీని దేశంలోనే
శక్తివంతమైన పార్టీగా తీర్చిదిద్ది...
ప్రజలకు పార్టీని చేరువ చేయడంలో
అద్భుతమైన విజయాలను సాధించిన
నవరత్నాల సృష్టికర్త ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వై.యస్.జగన్ మోహన్ రెడ్డి గారు
ముఖ్యమంత్రి పదవి చేపట్టి
మొట్ట మొదటి సారిగా నగరి కి విచ్చేసి
"విద్యా దీవెన" కార్యక్రమాన్ని
నగరి నుండి ప్రారంభించనున్న శుభసందర్భంగా
స్వాగతం - సుస్వాగతం
శ్రీ వై.యస్.జగన్ మోహన్ రెడ్డి గారు
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
ఆర్.కె.రోజా సెల్వమణి
ఆంధ్రప్రదేశ్ పర్యాటక, క్రీడలు, యువజన సర్వీసులు
సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు
నగరి నియోజకవర్గం వీవర్స్

దేశ సమగ్రత కోసమే ఉమ్మడి పౌరస్మృతి

- ప్రముఖ జర్నలిస్ట్ రాకా సుధాకర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాకా సుధాకర్

తిరుపతి సిటీ: దేశ సమగ్రత, సమైక్యత కోసం ఉమ్మడి పౌరస్మృతి (అందరికీ ఒకే విధమైన చట్టం) అమలులో ఉండాలని ప్రముఖ జర్నలిస్ట్ రాకా సుధాకర్ అభిప్రాయపడ్డారు. ఉమ్మడి పౌరస్మృతి అనే అంశంపై ఆదివారం తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీలో సమలోచన సంస్థ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం అనంతరం ఈ దేశంలో రావలసిన ఉమ్మడి పౌరస్మృతి చట్టం 76 ఏళ్ల తర్వాత వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టం ఒక మతానికో.. ఒక వర్గానికో పరిమితమైంది కాదన్నారు. ఒకే దేశం–ఒకే ప్రజ–ఒకే చట్టం అనే రీతిలో ఈ దేశ భవిష్యత్తు, సమైక్యత కోసం అవసరమన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. దేశం అభివృద్ధి చెందాలంటే అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి రావాలన్నారు. ప్రముఖ న్యాయవాది ఎం నాగరాజు మాట్లాడుతూ, ఒకే దేశం–ఒకే చట్టం ఉండాలని, వేర్వేరు వర్గాలకు అనేక రకాలుగా చట్టాలు ఉండటం సమంజసం కాదన్నారు. సదస్సులో సమాలోచన సంస్థ రాష్ట్ర అధ్యక్షులు అశోక్, జిల్లా కన్వీనర్ డాక్టర్ మార్గాని సోమశేఖర, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీప్రియ, డాక్టర్ దత్తాత్రేయ, దొమ్మరాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరు.. పుత్తూరు

- ప్రారంభోత్సవానికి సిద్ధంగా షాదీ మహల్
- మంత్రి ఆర్‌కే రోజా నేతృత్వంలో
- రూ.186.38 కోట్లతో అభివృద్ధి పనులు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా షాదీమహల్



పుత్తూరులో ఇటీవల ప్రారంభమైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

పుత్తూరు రూరల్: పట్టణంలో షాదీమహల్ ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా ఒక షాదీమహల్ నిర్మాణం కోసం రూ.1.85 కోట్లు మంజూరు చేసిన తొలి ప్రభుత్వంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోనుంది. పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందని స్థానిక మైనారిటీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క షాదీమహలే కాకుండా రూ.2 కోట్లతో మున్సిపల్ భవనం, రూ.1.60 కోట్లతో రెండు అర్బన్ హెల్త్‌సెంటర్లు, రూ.1.10 కోట్లతో విద్యుత్ దహన వాటిక నిర్మాణ పనులు చివరి దశకు చేరుకుని ప్రారంభోత్సవాలకు పోటీ పడుతున్నాయి. నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క పుత్తూరులోనే రూ.186.38 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం కాగా ఇప్పటికే రూ.25.24 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. ఇందులో మున్సిపాలిటీ 5వ వార్డులోని పిళ్లారిపట్టు వద్ద రూ.7.60 కోట్లతో అన్ని హంగులతో పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని నిర్మించారు. 2008లో నాటి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ కళాశాల నేటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూపుదాల్చడం విశేషం. 2019 సెప్టెంబర్ 19న ఎమ్మెల్యే హోదాలో కళాశాల భవనానికి భూమిపూజ చేసిన ఆర్‌కే రోజా, తరువాత మంత్రి హోదాలో కళాశాలను ప్రారంభించడం జరిగింది. అలాగే కళాశాల, రూ.1.10 కోట్లతో మున్సిపల్ పార్క్, రూ.25 లక్షలతో ద్రౌపదీదేవి ఆలయ రాజగోపురం పనులు పూర్తి చేసి మంత్రి రోజా చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. అలాగే నాడు–నేడు పథకం ద్వారా ఫస్ట్ ఫేస్‌లో రూ.4.61 కోట్ల వ్యయంతో 18 స్కూళ్లను ఆధునీకరించడం జరిగింది. 14వ ఆర్థికసంఘ నిధులు రూ.6.82 కోట్లతో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.4.86 కోట్లతో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగునీటి బోర్లు, పైపులైన్లు వంటి అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. అత్యంత ప్రధానమైనది రూ.139 కోట్లతో శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలువ నుంచి పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకుకు పైపులైను పనుల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయి. నాడు–నేడు సెకండ్ ఫేస్‌లో రూ.14.94 కోట్లు మంజూరు కాగా 48 స్కూళ్లతో పాటు 2 జూనియర్ కళాశాలల ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

పుత్తూరులో ప్రారంభించిన అభివృద్ధి పనులు	రూ.కోట్లలో
పాలిటెక్నిక్ కళాశాల	7.60
నాడు–నేడు ఫస్ట్ ఫేస్	4.61
మున్సిపల్ పార్క్	1.10
ద్రౌపదీదేవి రాజగోపురం	0.25
రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు 14వ ఆర్థిక సంఘం (2018–21)	6.82
రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు 15వ ఆర్థిక సంఘం (2020–21)	4.86
మొత్తం	25.24

జరుగుతున్న ప్రధాన పనులు..	
ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) ద్వారా శాశ్వత మంచినీటి పథకం	139.00
మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణం	2.00
షాదీ మహల్ నిర్మాణం	1.85
వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్లు (2)	1.60
విద్యుత్ శ్మశాన వాటిక	1.10
షెడ్యూల్ కులాల ఏరియాలో పనులు (6)	0.40
ఈశ్వరాలయం కోనేరు నిర్మాణం	0.25
నాడు–నేడు సెకండ్ ఫేస్ పనులు (50)	14.94
మొత్తం	186.38

సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

- భారీగా తరలిరానున్న ప్రజలు
- పకడ్బందీగా ఏర్పాట్లు



సీఎం సభకు రావాలని ప్రజలను ఆహ్వానిస్తున్న వైస్ చైర్మన్ శంకర్

పుత్తూరు రూరల్: విద్యాప్రదాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం నగరికి విచ్చేస్తున్న సందర్భంగా సభను విజయవంతం చేద్దామని ప్రతి నాయకుడు, కార్యకర్త సిద్ధం కావాలని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.శంకర్ పిలుపునిచ్చారు. మంత్రి ఆర్‌కే రోజా దిశానిర్దేశం చేసిన విధంగా ప్రతిఒక్కరూ వారికి కేటాయించిన బాధ్యతలను నెరవేర్చాలని కోరారు. వాహనాల్లో వచ్చేవారు జాగ్రత్తలు పాటించాలని, నిర్దేశిత ప్రాంతాల్లోనే వాహనాలను నిలపాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణతో సభను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలే కాకుండా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు సమపాళ్లలో అందిస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలుపుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

నింద్రలో..

నింద్ర: నగరిలో సోమవారం జరిగే సీఎం జగన్ సభను విజయవంతం చేద్దామని ఎంపీపీ దీప అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం సభలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయడానికి అధికారులకు ఆదేశించారు. సమావేశానికి వెళ్లేవారు వారికి కేటాయించిన ప్రాంతాల్లోనే వాహనాల పార్కింగ్ చేయాలని కోరారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నగరి పర్యటనను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సీఎం సభ విజయవంతంపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి సచివాలయానికి ఒక బస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కార్యక్రమం విజయవంతం అయ్యేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి, మండల సచివాలయం కన్వీనర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, నాయకులు జనార్ధన్, కుప్పయ్య, బాబు, రామచంద్రయాదవ్, మహేష్, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కే.పద్మనాభ రెడ్డి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

ఎన్నో ఏళ్ల కల.. సాకారమైన వేళ..

మారుమూరు ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు సైతం ఉన్నతవిద్యను అందించాలన్న సంకల్పంతో రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయం విదితమే. వెదురుకుప్పం మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎన్నో కల. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలువతో, డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో మండల ప్రజల ఆకాంక్ష నెరవేరింది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ బంగారు బాటలు వేస్తున్నారు.



వైఎస్సార్ డిగ్రీ కళాశాల

- సీఎం వైఎస్ జగన్ చలువతో వెదురుకుప్పంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు



సీఎంకు డిగ్రీ కళాశాల మెమెంటోను అందజేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి(ఫైల్)

వెదురుకుప్పం: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మండల ప్రజల కోరిక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలువతో ఉప ముఖ్యమంత్రి కే.నారాయణ స్వామి ప్రత్యేక చొరవతో నెరవేరింది. ఉన్నత చదువులు భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు రావాలంటే అది కేవలం చదువుతోనే సాధ్యమని భావించిన సీఎం జగన్ ఉన్నతవిద్యకు పెద్దపీట వేస్తున్నారు. మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు తీసుకుంది. గతంలో ఇక్కడ డిగ్రీ కళాశాల లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఉన్నతవిద్యకు దూరమయ్యే వారు. లేదంటే డిగ్రీ చదవాలంటే సుదూర ప్రాంతాలైన పుత్తూరు, చిత్తూరు, తిరుపతికి వెళ్లాలి. అయితే ఇదంతా వ్యయ ప్రయాసలతో కూడుకున్న విషయం. దీనికితోడు సకాలంలో బస్సులు లేక, సమయానికి రాక విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురైన సందర్భాలెన్నో. బాలికలు అయితే ఇంటర్‌తోనే చదువులకు స్వస్తి చెప్పేవారు. ఈ సమస్యను తల్లిదండ్రులు గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న కే.నారాయణస్వామి దృష్టికి తీసుకొచ్చారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని నాడు హామీ ఇచ్చారు. ప్రస్తుతం డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సంబంధించి అనుమతులు వచ్చాయి. ఇన్నేళ్లకు మండల ప్రజల కల సాకారమైంది.

ఉన్నతవిద్యకు ఊతమిచ్చేలా..

డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్యా ప్రమాణాలతో కూడిన ఉన్నతవిద్యను అందిస్తున్నారు. అధునాతన విద్యా ప్రపంచంలో పోటీ పడే విధంగా విద్యార్థులకు కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. చవటగుంట డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారు.

ఫ్యాకల్టీ ఫుల్..

కళాశాలలో పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీ సౌకర్యం కల్పించారు. టీచింగ్ ఫ్యాకల్టీ 20 మంది పని చేస్తున్నారు. ఇందులో 15 మంది రెగ్యులర్ అధ్యాపకులు, ముగ్గురు కాంట్రాక్టు, ఇద్దరు గెస్ట్ లెక్చరర్లుగా పని చేస్తున్నారు. అదేవిధంగా నాన్ టీచింగ్ కింద ఐదుగురు రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఐదుగురు పనిచేస్తున్నారు. డిగ్రీ కళాశాల అభివృద్ధికి సంబంధించి రూ.15 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలోనే మోడల్ డిగ్రీ కళాశాలగా రూపుదిద్దుకోనుంది. నిధులు మంజూరైన వెంటనే పక్కా భవనాల నిర్మాణాలతో పాటు మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టనున్నారు.

ఎన్‌సీటీఈ నిబంధనలు పాటించాలి

తిరుపతి ఎడ్యుకేషన్: జూనియర్ లెక్చరర్ల పోస్టుల భర్తీలో ఎన్‌సీటీఈ నిబంధనలను పాటించాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్(ఫోర్టో) ఉమ్మడి జిల్లా చైర్మన్ దొడ్డా ఉమామహేశ్వర్ తెలిపారు. ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం వర్చువల్‌గా నిర్వహించారు. అయన మాట్లాడుతూ జేఎల్ పోస్టుల భర్తీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ నిబంధనల మేరకు పీజీతో పాటు బీఈడీ ఉన్న వారే జూనియర్ లెక్చరర్ల పోస్టులకు అర్హులని తెలిపారు. 70 శాతం ఫీడర్ కేటగిరి వారికి పదోన్నతుల ద్వారా, 30 శాతం రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలు చేపట్టాలని కోరారు. ప్లస్ టూ పాఠశాలల్లో 11, 12వ తరగతులకు బోధించే టీచర్లకు జూనియర్ లెక్చరర్లతో సమానంగా వేతనాన్ని ఇస్తూ గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. అలాగే జీఓ 117, 128ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫోర్టో ప్రధాన కార్యదర్శి పి.మునిరత్నం, నాయకులు వి.మురళీ మోహన్‌రెడ్డి, కె.రామమూర్తి, కె.వాసుదేవయ్య, కె.రవి, సి.ఈశ్వరయ్య, సి.భారతి, పి.రమేష్, కె.ఆంజనేయులు, ఎం.సిరాజ్ అహ్మద్, వి.సురేష్, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం.. బెంగళూరులో ప్రత్యక్షం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఇంటర్ విద్యార్థి ప్రణవ్ సాయి (15) అదృశ్యమై బెంగళూరులో ప్రత్యక్షమాయ్యాడు. స్థానిక రామ్‌నగర్ కాలనీకి చెందిన గణపతి కుమారుడు ప్రణవ్‌సాయి ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం స్నేహితుడి ఇంటికి వెళుతున్నట్లు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి మళ్లీ రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో బెంగళూరులో ప్రణవ్ సాయి ని అక్కడ వారి బంధువులు గుర్తించి అతన్ని తీసు కుని ఆదివారం రాత్రి చిత్తూరుకు బయలుదేరారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.50 లక్షల విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.50 లక్షల బెంగళూరుకు చెందిన జయప్రకాష్ కుటుంబసభ్యులు ఆలయ అధికారులకు అందజేశారు. ఆదివారం దాత కుటుంబసభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి గోసంరక్షణ ట్రస్ట్‌కు విరాళం అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌బాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం రేపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఐటీడీఏ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అమర హాస్పిటల్, తిరుపతి, ఎంజీఎం హాస్పిటల్ శ్రీకాళహస్తి వైద్యసిబ్బంది వైద్యపరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేడుకగా ఉద్దికేశులమ్మ అమ్మవారి ఊరేగింపు



నాగలాపురం: మండలంలోని గ్రామదేవత ఉద్దికేశులమ్మ కొలువు పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి పలురకాల అభిషేకాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణలో భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని అలంకరించి పురవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ఆదివారం ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఏ సర్వీసు బస్సు వచ్చినా ఎక్కడానికి ప్రయాణికులు క్యూకట్టారు. ఎక్స్‌ప్రెస్‌లతోపాటు ఆర్డినరీ సర్వీసులు కూడా రద్దీగా నడిచాయి. ప్రయాణికులను క్రమబద్ధీకరించాల్సిన అధికారులు కనిపించలేదు. ప్రయాణికులు సీట్ల కోసం తోపులాటకు దిగారు. దొంగలు హల్‌చల్ చేశారు. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ లోపంతో బస్టాండ్లు గందరగోళంగా మారుతున్నాయి.

నీలివర్ణ శోభితం



హస్త్రాద్రిపై భానుడు అస్తమించేవేళ అంబర వీధిన మేఘాలు బంగారు, నీలి వర్ణంతో మెరుస్తూ కనువిందు చేశాయి. ఇది పుత్తూరు మండలం తడుకు వద్ద కనిపించింది. స్థానికులు ఈ దృశ్యాన్ని చూసి మురిసిపోయారు. సెల్ ఫోన్లలో బంధించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

క్లుప్తంగా

వాహనాల రూట్ మళ్లింపు

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు భారీ వాహనాలు, ఇతర వాహనాల రాకపోకలను, పళ్లిపట్టు నుంచి నగరికి వచ్చే వాటిని గుండ్రాజుకుప్పం గ్రామం నుంచి పుత్తూరు వైపునకు మళ్లించామని సీఐ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పుత్తూరు నుంచి చెన్నై హైవేలో వచ్చే వాహనాలను పుత్తూరు నుంచి నింద్ర మీదుగా చెన్నైకి, తిరుత్తణి నుంచి తిరుపతి వైపు వెళ్లే వాహనాలను కనకమ్మసత్రం, విజయపురం, నింద్ర మీదుగా పుత్తూరుకు మళ్లించడం జరిగిందన్నారు. వాహనదారులు సదరు మార్గాల్లో వెళ్లి సహకరించాలని కోరారు.

కీళపట్టు నుంచి రోడ్ షో

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు హెలిప్యాడ్ నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సులో రోడ్ షోగా సభాస్థలికి చేరుకుంటారు. సుమారు రెండు కిలోమీటర్లు వరకు జనంతో మమేకమవుతారు. అభిమాన నేతను చూసేందుకు తరలివచ్చే ప్రజల కోసం రోడ్డుకు ఇరువైపులా బ్యారికేడ్లు నిర్మించారు. జిల్లా పోలీసు యంత్రాంగం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది.

తెలుగు పద్యాల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న అతిథులు

శ్రీరంగరాజపురం : మండలంలోని నల్లాపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు తెలుగు సాహిత్యంలో తమ ప్రతిభను ప్రదర్శించి బహుమతులను పొందారు. తెలుగు సాహిత్యం సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జిల్లాలోని పలమనేరులోని కళామందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పద్యాలు పోటీల్లో నాలుగో తరగతికి చెందిన రితిక, హరిప్రియ, ఐదో తరగతికి చెందిన యామిని ఈ పోటీల్లో పాల్గొన్నారు. తెలుగు సాహిత్యం, సాంస్కృతిక పద్యాల పోటీల్లో వీరు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు. స్థానిక సర్పంచ్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని, అక్కడ కూడా ఇలాగే ప్రతిభ చూపి రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి కార్యదర్శులు తులసినాథం నాయుడు, పుష్ప, నాయకులు చంద్రరెడ్డి, ధనుంజయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రదోషకాల పూజలు నేడు

వెదురుకుప్పం: అరుణగిరిలో కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రదోషకాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏకకాలంలో నందీశ్వరుడికి, శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మండల మీట్ రేపు

పుత్తూరు రూరల్: పుత్తూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఇందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మునివేలు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఆలయాల్లో ఏకాదశి పూజలు


ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: ఏకాదశిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సొరకాయలస్వామి ఆలయంలో ఉదయం మూలవర్లకు అభిషేకాలను నిర్వహించి, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనం అధిరోహించి, మాడవీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న స్వామికి ఆస్థానం నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు.

ప్రదోష పూజలు రేపు

నాగలాపురం: సురుటుపల్లి శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ రామచంద్రా రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలు నుంచి 6 గంటల వరకు ఈ ప్రదోషకాల పూజలు జరుగుతాయని ప్రదోష నందీశ్వరునికి వాల్మీకేశ్వర స్వామికి మరకదాంబిగై అమ్మవారికి ఏకకాలంలో అభిషేకాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ ఏవీఎం బాలిరెడ్డి తెలిపారు.


పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన స్వాగతతోరణాలు



పట్టణంలో కళకళలాడుతున్న ఫ్లెక్సీలు, పార్టీ పతాకాలు

నీ రాకకై..

సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో నగరికి విచ్చేస్తుండడంతో పండుగ వాతావరణం నెలకొంది. గత ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్ రాకకై జిల్లా ప్రజానీకం వెయ్యికళ్లతో ఎదురుచూస్తోంది. ఎటు చూసినా జైజగన్ నినాదాలు మార్మోగుతున్నాయి. రావాలి జగన్.. కావాలి జగన్ పాట మైకుల్లో హోరెత్తుతోంది. నగరి పట్టణమంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలకడానికి ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు, భారీ ఫ్లెక్సీలు, ఆకాశంలో ఎగిరే బెలూన్లు, రెపరెపలాడే పార్టీ పతాకాలతో నీలివర్ణంతో శోభిల్లుతోంది.



ఏర్పాటైన సభావేదిక, (ఇన్‌సెట్) హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న మంత్రులు, ఎంపీలు, అధికారులు

- నేడు నగరిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన
- మార్మోగుతున్న జైజగన్ నినాదం
- నభూతో నభవిష్యత్ అనేలా ఏర్పాట్లు
- బ్రహ్మరథం పట్టేందుకు నగరి ప్రజానీకం ఎదురుచూపులు
- జగనన్న విద్యాకానుక 5వ విడతను లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్

నగరి: రాజు బాగుంటే రాజ్యం బాగుంటుందన్న నానుడి మరోసారి నిజమనేలా ప్రకృతి సైతం సంక్షేమ సాధకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు సిద్ధమైంది. నిన్నటివరకు ఉక్కపోతతో ఇబ్బంది పడిన జనం వరుణుడు కరుణ చూపడంతో చిరుజల్లులు పడ్డాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వరుణుడు సైతం సీఎం జగన్‌కు ఆహ్వానం పలుకుతూ చల్లదనంతో నింపాడు. భవిష్యత్ తరాలకు భరోసా కల్పించాలన్నదే సీఎం జగన్ అభిమతం.

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్న విషయం విదితమే. అందులో భాగంగా జగనన్న విద్యాకానుక 5వ విడతను నగరిలో సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. దీంతో స్థానిక ప్రజల్లో ఆనందోత్సాహంతో ఎదురు చూస్తున్నారు.

సర్వం సిద్ధం..

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధమైంది. నగరిలో సోమవారం అట్టహాసంగా జరగనున్న జగనన్న విద్యాదీవెనను లాంఛనంగా ప్రారంభించడానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొననున్న విషయం తెలిసిందే. దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఆదివారం నగరిలో ఏర్పాట్లు జరుగుతున్న తీరును డిప్యూటీ సీఎం నారాయణస్వామి, రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ శాస్త్ర సాంకేతిక భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక, యువజన అభివృద్ధి శాఖ మంత్రి ఆర్‌కే రోజా, ఎంపీలు మిథున్ రెడ్డి, రెడ్డెప్ప, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్, ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పర్యవేక్షించారు. సభాప్రాంగణాన్ని, హెలిప్యాడ్‌లను, ఏర్పాటుచేసిన గ్యాలరీలను పరిశీలించారు. ముఖ్యమంత్రి హోదాలో నగరికి తొలిసారి వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి సభను నభూతో న భవిష్యత్ అనేస్థాయిలో నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు విశేషంగా కృషి చేస్తున్నారు. సభకు భారీగా ప్రజలు రానున్నందున వారికి ఏ ఇబ్బంది కలుగకుండా అన్నిచర్యలు చేపట్టారు. ఏరియా ఆస్పత్రిలో వీఐపీ వార్డులను సిద్ధం చేశారు.

సిద్ధమైన సభావేధిక..

నగరి పుత్తూరు మార్గం షిరిడీసాయి దివ్యధామం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగసభా వేదిక అందంగా ముస్తాబైంది. జిల్లావ్యాప్తంగా వచ్చే ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూర్చునేందుకు వీలుగా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ద్విచక్రవాహనాలు, పెద్ద వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు.

జగనన్నకు ఘనస్వాగతం పలుకుదాం..



నగరి పట్టణానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కనీవినీ ఎరుగని రీతిలో స్వాగతం పలుకుదామని మంత్రి ఆర్‌కే రోజా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా నగరికి తొలిసారి విచ్చేస్తున్న ముఖ్యమంత్రిని సాదరంగా ఆహ్వానిద్దామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అడిగిందే తడవుగా నిధులు మంజూరు చేసిన వరాలరేడు, నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించిన సంక్షేమ సారథి విద్యాదీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి నగరికి విచ్చేస్తున్నారని, ఆయనకు మన ప్రేమ, అభిమానాలతో ఘన స్వాగతం పలుకుదామన్నారు.

పటిష్ట బందోబస్తు..


పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ రిషాంత్ రెడ్డి

సీఎం పర్యటన నిమిత్తం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన నిమిత్తం విధి నిర్వహణకు విచ్చేసిన పోలీసులకు స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో ఎస్పీ రిషాంత్ రెడ్డి సూచనలు అందించి విధులను కేటాయించారు. హెలిప్యాడ్‌కు విచ్చేసే హెలికాప్టర్, ముఖ్యమంత్రి కాన్వాయ్‌లను ట్రయల్ రన్ నిర్వహించారు.


హెలికాప్టర్ ట్రయల్‌రన్


కాన్వాయ్ ట్రయల్‌రన్


బహిరంగ సభకు విచ్చేసే ప్రజలు కూర్చోవడానికి సిద్ధమైన గ్యాలరీలు

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి


వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గోపీని అభినందిస్తున్న మంత్రి కుమార్తె కృపాలక్ష్మి

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.గోపీని నియమించడం అభినందనీయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె వైఎస్సార్‌సీపీ నాయకురాలు కృపాలక్ష్మి అన్నారు. ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపీని కృపాలక్ష్మి, ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ పలువురు సర్పంచ్‌లు, నాయకులు శాలువలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తున్న గోపీని జిల్లా కార్యదర్శిగా నియమించడం సంతోషకరమన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శిగా నియమితులైన గోపి మాట్లాడుతూ జిల్లా కార్యదర్శి హోదా ఇచ్చి బాధ్యతను మరింత పెంచారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్‌రెడ్డి, అనిల్‌కుమార్, యుగంధర్‌నాయుడు, శేషాద్రి, నాగభూషణం పలువురు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం


నగరి ప్రభుత్వాస్పత్రి

- రూ.5.4 కోట్లతో ఆస్పత్రి ఆధునీకరణ
- నేడు సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభం

నగరి: పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలను మంత్రి ఆర్కే రోజా చొరవ తీసుకుని పూర్తిస్థాయిలో ఆధునీకరించారు. రూ.5.4 కోట్ల ఖర్చుతో పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఆస్పత్రి అవసరాలకు అనుగుణంగా అదనపు గదులు నిర్మించారు. కొత్త ఫ్లోరింగ్ వేశారు. కారుతున్న సీలింగ్‌లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. ఆస్పత్రిలో రెండు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల రోగులు చికిత్స పొందే బెడ్ల వద్దే ఆక్సిజన్ పొందే అవకాశం ఉంటుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గల ప్రసవగది, ఎక్స్‌రే రూమ్, డెంటల్ చైర్, ఎలక్ట్రిక్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. వార్డుల్లో రోగుల కోసం అత్యాధునిక బెడ్లను అమర్చారు. అన్నిరకాల పరీక్షలు నిర్వహించే సాంకేతిక పరిజ్ఞానం ఉన్న కంప్యూటరైజ్డ్ ల్యాబ్ ఏర్పాటుతో తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యం అందనుంది. విద్యుత్ సరఫరాలో సమస్య రాకుండా 160 కిలోవాట్స్ సామర్థ్యం గల జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ఆస్పత్రికి వెళ్లే రహదారి సమస్యను పరిష్కరించారు. మెయిన్ రోడ్డు నుంచి ఆస్పత్రి వరకు వీధిలైట్లు వేశారు. డయాలసిస్ వార్డు ఏర్పాటు చేస్తున్నారు. అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించారు. నూతన హంగులతో కూడిన ఆస్పత్రి పునరుద్ధరణ పనులను సీఎం జగన్ సోమవారం ప్రారంభించనున్నారు.


ఆక్సిజన్ సిలిండర్లు

అట్టహాసంగా అగ్నిగుండ ప్రవేశం


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

- కల్పవృక్ష, సూర్యప్రభ వాహనాలపై విహరించిన ద్రౌపదీదేవి
- బ్రహ్మోత్సవాలకు బ్రహ్మరథం పట్టిన భక్తజనం

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవి సత్యశీలతకు ప్రతీకగా నిర్వహించే అగ్నిగుండ ప్రవేశం అట్టహాసంగా జరిగింది. పుత్తూరు శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన అగ్నిగుండంలోకి సుమారు 3 వేలమంది భక్తులు ప్రవేశించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు, మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగె ఆలయానికి చేరుకుంది. గెరిగె నీటితో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. ద్రౌపదీదేవి సమేత ధర్మరాజు స్వామివారిని విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 11 గంటలకు కల్పవృక్ష వాహనంపై శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీఅర్జున స్వాముల వారు ఆలయ తిరువీధుల్లో విహరించారు. ఇంటింటా భక్తులు కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశం కోసం భక్తులు ఆలయం వద్ద కంకణాలు ధరించారు. ఏటా మగవారితో పాటు మహిళలు సైతం అగ్నిగుండ ప్రవేశం చేయడం విశేషం. కంకణదారులైన భక్తులు 9 బావుల్లో స్నానాలు ఆచరించి చివరగా మంచినీళ్ల గుంట వద్దకు చేరుకున్నారు. అక్కడ మగవారు పసుపు పంచె, మహిళలు పసుపు చీరతో పాటు తలకు పూలు చుట్టుకుని ముస్తాబయ్యారు. సాయంత్రం 6 గంటలకు గెరిగె ఊరేగింపుగా ముందు వెళ్తుండగా వెనుక అగ్నిగుండ కంకణ దారులైన భక్తులు బారులు తీరి అనుసరించారు. గెరిగె ఆలయానికి చేరుకోగానే ద్రౌపదీదేవి, పోతురాజు ఉత్సవమూర్తులను అగ్నిగుండం వద్ద కొలువుదీర్చారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు బాబు ముందుగా అగ్నిగుండం నుంచి నిప్పును తీసి అమ్మవారి పైటకొంగులో వేశారు. పూలబంతిని అగ్నిగుండంలో వేసి భక్తులను అగ్నిగుండంలోకి అనుమతించారు. గోవిందనామ స్మరణలతో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అగ్నిగుండ ప్రవేశం పూర్తయిన అనంతరం ఆలయంలోని అలుగు కుంభాగ్రహం నుంచి కత్తి పరిగ్రహించబడింది. రాత్రి 9 గంటలకు విద్యుత్ దీపాలతో అలంకరించిన సూర్యప్రభ వాహనంలో శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీఅర్జునస్వామి ఆలయ తిరువీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చారు. అగ్నిగుండ ప్రవేశ అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలి రావడంతో పుత్తూరు పట్టణం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీ మోహన్, సభ్యులు ముకుందప్రకాష్, సెల్వరాజ పిళ్లై మునిరాజ, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, ఆలయ నిర్వాహకులు సాల్వాకం ఏలుమలై మొదలి, పళణిమొదలి, గోపీమొదలి, పెరుమాళ్‌మొదలి, కుప్పుస్వామి మొదలి పర్యవేక్షించారు.


కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న శ్రీద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి

బ్రహ్మోత్సవాల్లో నేడు..

ఉదయం 7 గంటలకు అగ్నిగుండం శాంతిపూజ, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి వసంతోత్సవం, రాత్రి 9 గంటలకు ధ్వజావరోహణం

7న గోకులాష్టమి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ శ్రీ కృష్ణస్వామి ఆలయంలో సెప్టెంబరు 7న గోకులాష్టమిని ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోకులాష్టమి రోజున ఉదయం శ్రీకృష్ణస్వామి మూలవర్లకు అభిషేకం, అర్చన చేస్తామని, ముఖ మండపంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీకృష్ణ స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ చేస్తామని వెల్లడించారు. రాత్రి 7 నుంచి 8.15 గంటల వరకు స్వామివారు పెద్దశేష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారని తెలిపారు.